కథానిక

# లోపలి రక్కసి

పి. శ్రీనివాసరావు

ఐతే విను మరి—ఆలకిస్తున్నావా? ... అడ్డు ప్రశ్నలు వేయకేం...ఆతర్వాత.

జనం కోలాహలంగా తిరుగుతున్నారు ... వొకటే సంరంభం! ఒకవ్యక్తికి రెండో వ్యక్తితో మాట్లాడే తీరికేలేదు. అటు యిటు పరుగులు తీసే వారి పదఘట్టనలతో ఆ నేల అరిగిపోదు గదా! యెవరినైనా పలకరించాలన్నా గొంతుచించుకుని బిగ్గరగా కేకవేయాలి...అంత కష్టపడ్డా అవతల వ్యక్తి వినిపించుకోవాలిగా అసలు.

పాకశాలనుంచి మధురమైన వాసనలు గాలిలో తేలివచ్చి వువ్విళ్లూరిస్తున్నయ్...యీ వాసనలకు తోడు రసికులపుణ్యాన అత్తరువాసనలు—నాకేం పాలుపోలేదు.

ఒక్కసారిగా చెవులు దిబ్బళ్లెత్తేట్టు మంగళ తూర్యారవాలు ప్రతిధ్వనించి ఆ కోలాహలాన్ని మింగివేసినై.

'వూఁ...లగ్నం సమీపిస్తున్నది...త్వరపడండి ...పెళ్లికొడుకు, పెళ్లికూతుర్నీ తీసుకురండి... యింకా చూస్తారేమయ్యా...త్వరగా...వూఁ!'

'రావయ్యా!' నన్ను యెవరో రెక్కపుచ్చుకు లాగారు.

'ఎందుకు? ఎక్కడికీ?' అన్నాను.

'ఇదేం వేళాకోళం గాదు. వరుడివి, లగ్నం సమీపిస్తువుంటే వొకచెంప!' అతనెవరో నాకు తెలియదు. నన్ను యెందుకు వరు డంటున్నాడో అసలు అంతకీ తెలియదు. దిగ్భ్రాంతుణ్ణిగానుమరీ...? నేచెప్పబోయేది వినకుండా, బరబర యీడ్చుకువెళ్లి పెళ్ళిపీటలమీద కూలవేశాడు ... అప్పుడు నేనే మన్నా ప్రతిఘటించానా? ఏమో! పోనీ మాట్లాడానా అంటే అదీ గుర్తులేదు.

ఆడవాళ్లు గబగబ యెవరో అమ్మాయిని తెచ్చి నాప్రక్కనే కూచోబెట్టారు ... పెళ్ళని అర్థం చేసుకున్నా ననుకుంటాను అప్పటికి.

యధావిధిగా కార్యక్రమం నాయిష్టాయిష్టాల్తో ప్రమేయంలేకుండనే సాగిపోతున్నది...తలంబ్రాలు పోసేటప్పుడు గావాలి వధువుముఖం చూశాను... యెవరా అమ్మాయి?...యెన్నడు చూడలేదే? మనసు మారుమూలల్లో నిద్రిస్తున్న ఆలోచనలు కొన్ని మేల్కొన్నయ్...స్మృతిపథాన యేదో తళుక్కుమన్నది...మళ్ళీ చూశాను ... పరిచయ మున్న ముఖమే...అవును... నేను రోజూ చూసే ముఖమే...నాకు సన్నిహితమిత్రుల్లో వొకడైన నిరంజన్ భార్య పద్మ...యిదేమిటీ దుర్మార్గం? నన్ను 'అన్నయ్యా' అని పిలిచే ఆవిడ ... వొక మిత్రుడి భార్యతో నాకు పెళ్లిఎలా జరగడం?... ఐతే అంతకుక్రితమే వధువు ఆవిడగాదే...యెవరో చూడనిమనిషే...మరి ఆ అమ్మాయి యేమైంది? చెల్లాయి పద్మ వధువు కావడమేమిటి?...అంతా అయోమయం...కళ్లు గిర్రున తిరిగాయి...బ్రతికే వున్నానా? చనిపోయానా? అనుకున్నాను. ఆ తర్వాత యేం జరిగిందో జ్ఞాపకం లేదు...అదరి పాటుతో లేచాను...అంతే!

...అదీ అబ్బాయ్! జరిగిన కల!...

నాకు ఆకలమీద యెంత కోప మొచ్చిందను కున్నావ్?...ఛీఛీ! అందులోనూ రోజూ 'అన్నయ్యా' అంటూ ఆప్యాయంగా పిలిచే చెల్లివంటి పద్మ...ప్రియమిత్రుడి భార్యమీద!... అందుకే రెండు రోజులవరకు మనసు కలవర పడింది...నిరంజన్ కనపడి గుచ్చిగుచ్చి అడిగాడు యింటి వేపు రావడం లేదేమని? చివరకు వాడి తోబాటు యింటికెళ్ళాను......పద్మ ప్రాణాలు తోడేసింది ప్రశ్న పరంపరతో.

ఉండు మరి...కాస్త గత చరిత్ర చెప్పనీ... వారికి నాకూ పరిచయ మెలా కుదిరిందో తెలుసు కునేందుకు కుతూహల పడుతున్నావ్ గదోయ్!

కొత్త ఆడవాళ్ళతో మాట్లాడ్డానికి నేను జంకు తాననే విషయం కొత్తగాదు. కొన్నాళ్ళవరకు వాళ్ళు కలిమిడితనంతో కబుర్లుచెప్పినా నేను తటపటాయిస్తూనే వుంటాను...నిరంజన్ బాల్య మిత్రుడే...వుద్యోగ రీత్యా నేను వాడున్న వూరు వెళ్ళడం తటస్థించింది...నిరంజన్ అప్పటినుంచీ నీడలా యెప్పుడూ నా వెంటే వుండేవాడు...ప్రతి రోజూ నేను వాళ్ళయింటికి వెడుతూవుండేవాణ్ణి.... భార్యాభర్తలిద్దరూ నన్ను వాళ్ళ కుటుంబం లోని వాళ్ళలాగేచూస్తుండేవారు...పద్మ అంతగా బిడియపడే రకం గాదు. 'అన్నయ్యా' అంటూ నన్నెంతో ప్రీతిగాచూసేది. నిరంజన్ వున్నా లేకున్నా నే నావిడకు పుస్తకాలు, పత్రికలు యివ్వడం, కబుర్లు చెప్పడం మామూలు...అయితే నాకున్న దుర్బలత్వం ప్రకారం పద్మ యెంత 'ఫ్రీ'గా మాట్లాడినా, నేను తడబడుతూ ముఖంయెత్త డానికి సంకోచించడం, యెత్తినా సూటిగా ఆవిడ ముఖంలోకి చూడ లేకపోవడం నాకే చిరాకు కలిగేది. అందుకని పద్మ, నిరంజన్‌లు నన్ను కొత్తలో అల్లరిపెట్టే వాళ్ళు.

ఆ రోజుల్లో నాప్రవర్తన నాకే అవగతమయేది గాదు. ఏ రోజైనా అవసరకార్యాల్లో నిమగ్నుణ్ణయివుండి నిరంజన్ యింటికి వెళ్ళగూడ దనుకున్నా, నాకు తెలియకుండానే, ఏదో అపస్మారంలోవలె, నా కాళ్ళు అటుకేసి దారితీసేవి.

మరో వింత విషయం! వాళ్ళిద్దరూ నాకు చిరపరిచితులయ్యారు గదా! కొత్త వాళ్ళ యింటికి వెళ్ళినట్టు, ప్రతిరోజు నిరంజన్ యింటికి పోయేటప్పుడు వేషం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనడం నాకే అర్థమయ్యేదిగాదు. అంత శ్రద్ధ అప్రస్తుతం గాదూ? పద్మతో మాట్లాడుతూ మధ్య మధ్య మాటలకోసం తడుముకునేవాణ్ణి. సంభోధించేటప్పుడు వాక్యంచివరన 'అమ్మ'. అనే తోక తగిలించడానికి శ్రద్ధతీసుకునేవాణ్ణి... ఐనా ఆ మాటవచ్చినప్పుడు కంఠం వణికేది... బయటికి వచ్చాక నాలో నేను తర్కించుకునేవాణ్ణి- యెందు కంత తికమక పడవలసి వచ్చిందో అని... ఆదేమన్నా భేషజమా?...పద్మ మెప్పుపొందాలనీ, ఆవిడ దృక్పథంలో ఆదర్శప్రాయుడిగా కన్పించాలనీ, ప్రయాసపడే అవసరం నా కెందుకు కలగాలో వూహించలేకపోయాను.

ఏ వాదం వచ్చినా నేను, పద్మ వొకతాటి మీదనే నడిచేవాళ్ళం...నిరంజన్ చిత్తుగాక యేం చేస్తాడు?

ఒకనాడు యేదో గృహకలహం వచ్చి నిరంజన్ కొద్దిగా చెయ్యి జేసుకున్నాడు...చాటుగా పద్మ నాకు ఆ విషయం వినిపించింది. ఎప్పుడూ నిరంజన్ వాదమే క్రమమైందిగాదనేగా నా సూత్రం- పద్మ నోదార్చి, నిరంజన్‌ను మందలించాను...ఐనా ఆ కార్యంలో నా మీద నాకే సందేహం కలిగింది. హృదయపూర్వకంగా చేశానా? ఐతే యెందుకు మందలించినట్లు?...బహుశా చెల్లి తృప్తికోసం నేనలా ప్రవర్తించానేమో?...ప్రతి విషయంలోనూ అంత సూక్ష్మపరిశీలన, వాళ్లంత ఆప్యాయంగా ప్రవర్తిస్తున్నా, నేను నా హృదయంలోని ద్వారాలన్నీ పూర్తిగా తెరవలేదనే నా అనుమానం. అందుకే మాటిమాటికీ జిజ్ఞాసా?

అదిగాక సంభాషణ సందర్భాన పద్మను స్పృశించాలనిపించేది, చనువు ప్రదర్శించేటందుకని ...స్పృశించినంతమాత్రాన సన్నిహితత్వం పెంపొందుతుందా?...ఐనా ముట్టుకోనబోయి, తడబడి, ఆప్రయత్నం విరమించాను చాల తడవలు... ముట్టుకోనబోవడం, ముట్టుకోనలేకపోవడం, రెంటికీ అర్థంలేదు.

ఇక కొంచెం...సొంతంగా చెప్పనీ మరి.

ఒకరోజుఏమయిందంటే, మేంముగ్గురం సినిమాకని బయల్దేరాం...అదైనా నా బలవంతాన్నే ...'అందరూ బాగుందంటున్నారు ... విమర్శలు కూడా సుముఖంగా వున్నయ్..ముఖ్యంగా పాటలు చాల హాయిగా, శ్రావ్యంగా వున్నాయిట!' అని వాళ్ళిద్దరిలో కుతూహలం రేకెత్తించాను...పద్మ కూడా పట్టుపట్టింది...నిరంజన్ యిక తప్పదనుకుని బయల్దేరాడు...ముగ్గురమూ కలిసి యెక్కడికైనా వెళ్ళడం అదే ప్రథమం.

ప్రక్క-ప్రక్కనే కూర్చున్నాం. చిత్రం నడక మందకొడిగానే వుంది. కానీ సంగీతంమటుకు కొంత వరకు, హీరోయిన్ కొంతవరకు రక్షించారు. హీరోయిన్ కొత్త ముఖమైనా నన్ను గిలిగింతలు పెట్టింది. అందుకు కారణం ఆవిడలోని 'సెక్స్ అపీల్'—ముఖ్యంగా ఆ చిలిపి కళ్ళు. ఆ మధురమైన చిరునవ్వులు సినిమా చూస్తున్నంత సేపు నా హృదయాన్ని మథించినై. బ్రహ్మచారి మనసులో

తీయని తలపులు పూచి పులకరింతలు కలిగించాయి. ఆ ముఖానికీ, యింకో ముఖానికీ సామ్యం యేదో మసక మసకగా స్ఫురించసాగింది. మనసు వూరికే ఆరాట పడసాగింది. సినిమా యెప్పుడైపోతుందా, యెప్పుడా తార కలిగించే బాధనుంచి తప్పించుకోవచ్చా, అని నిరీక్షిస్తూ కూచున్నాను. వాళ్ళిద్దరు నా వికారం గమనించినట్టులేదు.

చిత్రం పూర్తయింది. లైట్లు అమాంతంగా వెలిగినై.

లైట్లు వెలిగిన వెంటనే పద్మనుచూశాను. కళ్లు, బుర్రలోని ఆలోచనలు వొక్కసాగి గిర్రున పరిభ్రమించాయి.

పద్మ ముఖానికీ, ఆ తార ముఖానికి భేదంలేదు అంతగా! తార నాలో రేకెత్తించిన కోరికలన్నీ-పద్మ, తారల ముఖ సామ్యం గమనిస్తూనే నన్ను కుంగదీశాయ్.

పద్మ ముఖం చూడలేకపోయాను, నా తత్తరపాటు వారి కయోమయంగా తోచింది.

కల అంతర్యం వెంటనే విశదమైంది! దాంతోబాటు నా ప్రవర్తనలో సూచితమైన ద్వంద్వత్వానికి కారణమై ప్రచ్ఛన్నరూపంలో వుండిన కోరిక నిజస్వరూపంకూడ దర్శించాను. నువ్వూ ప్రయత్నించు మరి!

# నేటి యువకులు

జి. యస్. రామకృష్ణ

ఈమధ్య ఒక కాలేజీలో 'ఆంధ్రాభ్యుదయ వారం' జరిగింది. మొదటి రోజున కాలేజీ ఆవరణలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ఒక ఆంధ్ర రాజకీయ నాయకుడు ఉపన్యసిస్తాడని, విందామని నేను వెళ్ళాను. ఆయన ఉపన్యాసాన్ని విని-ప్రతి యువకునికి రాజకీయంగాను, ఆర్థికంగాను, వైజ్ఞానికంగాను, నైతికంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను చక్కని బాట చూపుతోందని అనుకున్నాను. అది ముమ్మాటికి నిజం కూడాను నేటి యువకలోకానికి ఇటువంటి ఉద్బోధలే చాలా అవసర మనిపించింది.

అయితే, నా కొక పిచ్చి అలవాటు వుంది. ఎక్కడైనా, ఎవరైనా ఉపన్యసిస్తోంటే - ఆ ఉపన్యాస సారాంశాన్ని గ్రహిస్తోండడమేగాక,అక్కడకు చేరిన ప్రేక్షకులు ఆవ్యక్తిని గూర్చి, అతని ఉపన్యాసాన్ని గూర్చి ఏవిధంగా తలపోస్తున్నారో వినాలని కూడా నా ఆశ. అందుచేత, ఈసభలో కూడా అదేవిధంగా, ప్రేక్షకులలో ఎక్కువమంది యైన యువకుల ధోరణి ఏవిధంగా ఉందో పరిశీలించాను.

కొందరు యువకులు సమూహంలో తలలు వంచి, ఈలలువేయడం మొదలెట్టారు. మరికొందరు మాటిమాటికి తప్పట్లు కొట్టడం—భజనలో ఏకతాళం మాదిరిగా—మొదలెట్టారు. ఒక ప్రక్కనుంచి పొలికేకలు వినవచ్చాయి. ఇంకో ప్రక్కనుంచి పొగ పైకి రావడం; మరో ప్రక్కనుంచి తాము కూర్చున్న బల్లలను వెనుకకు పడగొట్టి, అందరూ ఒక్కసారి గొల్లుమనడం; కొందరు ఉపన్యాసకుడు శాస్త్రులుగారివలె శాలువా కప్పాడని, మరికొందరు- ఆయన దగ్గితే- అందరూ దగ్గడం—ఈవిధంగా ప్రవర్తించడం జరిగింది.

నేనుకూడా ఒక యువకుడనే; నేను పెద్ద పెద్ద పట్టణాలలో నివసించినవాడినే; ఆధునిక నాగరికతా లక్షణాలు కలవాడినే, అల్లరిచేసేవారిలో నేను గొప్పవాడినే; రకరకాల ప్రవర్తనలు నాకూ తెలుసు కాని వాటిని ఆచరిస్తే నా జీవితచరిత్ర సులక్షణంగా వుండదనికూడా నాకు తెలుసు. మానవ సంఘంలో ఒక సభ్యతను పొందినాను. ఆ సభ్యతను గౌరవప్రదంగా కాపాడుకోటానికి, నా శక్త్యానుసారం కృషిచేయవలసినవిధి నా పైఎంతగానో వుంది. అల్లరిచిల్లరగా ప్రవర్తిస్తే, నా సభ్యత రద్దయిపోతుంది; నా సేవాఋణం, ఋణంగానే వుండిపోతుంది. ఆ ఋణాన్ని తీర్చలేని నా బ్రతుకు ఒక బ్రతుకా?

నేను మానవసంఘంలోకి వచ్చానంటే, నా